క్లుప్తంగా

పుల్వామా అమరవీరులకు నివాళి


అమరవీరులకు నివాళులర్పిస్తున్న స్థానికులు

పెద్దాపురం: పుల్వామా ఉగ్రదాడిలో మరణించిన వీర జవాన్లకు చంద్రమాంపల్లి జంక్షన్‌లో స్థానికులు, విద్యార్థులు బుధవారం నివాళులర్పించారు. ఆజాద్ నేషనల్ ఆర్మీ అధ్యక్షులు కోత్తెం కోటి ఆధ్వర్యంలో అమర వీరులకు సంస్మరణ సభ ఏర్పాటు చేసి పుల్వామా ఉగ్ర దాడిలో మృతి చెందిన జవాన్ల వీర మరణాన్ని స్మరించుకుంటూ శాంతియుత సంస్మరణ సభ నిర్వహించారు. పుల్వామ ఘటన సందర్భంగా ఫిబ్రవరి 14వ తేదీన బ్లాక్ డే గా పాటిస్తున్నట్టు తెలిపారు. సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి విద్యార్థులు, దుకాణ యజమానులు పాల్గొన్నారు.

రైల్వేల భద్రతకు సహకరించాలి


ప్రయాణికులతో మాట్లాడుతున్న రైల్వే ఎస్సై

సామర్లకోట: రైల్వేల భద్రతకు ప్రయాణికులు సహకరించాలని జీఆర్పీ ఎస్సై బి.లోవరాజు అన్నారు. బుధవారం స్థానిక రైల్వే వెయిటింగ్ హాళ్లలో ఉన్న ప్రయాణికులతో రైళ్లలో జరిగే అవకాశమున్న నేరాలపై అవగాహన కల్పించారు. అవాంఛనీయ సంఘటనల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. రైల్వే ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ సూచనల మేరకు తరుచూ ప్రయాణికులతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైళ్లపై రాళ్లు రువ్వడం, రైళ్లలో గంజాయి, మద్యం వంటి నిషేధిత వస్తువులు తీసుకువెళుతున్న సంఘటనలు గమనిస్తే వెంటనే ఆయా రైల్వే స్టేషన్ల పరిధిలో సమాచారం ఇవ్వాలన్నారు. రైళ్లలో అనుమానితులపై సమాచారం ఇవ్వాలని సూచించారు.

48 యూనిట్ల రక్తం సేకరణ

సామర్లకోట: స్థానిక వైఆర్ఎల్ డిగ్రీ కళాశాలలో బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. యువసేన బ్లడ్ బ్యాంకు, వైఆర్ఎల్ డిగ్రీ కళాశాల సంయుక్తంగా నిర్వహించిన శిబిరంలో 48 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. బ్లడ్ బ్యాంకు అధ్యక్షుడు సతీష్, వైఆర్ఎల్ డిగ్రీ కళాశాల డైరెక్టర్ వై.రవిచంద్ రక్తదానం వల్ల ప్రయోజనాలను వివరించారు. ప్రిన్సిపాల్ వై.లావణ్య, ఏఓ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం


రమణక్కపేట శ్మశానవాటిక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న అరబిందో ప్రతినిధులు

కొత్తపల్లి: అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం మండల పరిధిలోని గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వంగా గీత, ఎమ్మెల్యే పెండెం దొరబాబు విజ్ఞప్తి మేరకు అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.2 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. దీనిలో భాగంగా రమణక్కపేట, గోర్స గ్రామాల్లోని శ్మశాన వాటికల అభివృద్ధి పనులు, గోర్సలో సామాజిక భవనం, సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమాల్లో గ్రామ సర్పంచులు కాదులూరి అమ్మాజీ, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

బకాయిలపై కొరడా


మున్సిపల్ షాపుల యజమానులతో మాట్లాడుతున్న అధికారులు

సామర్లకోట: మున్సిపల్ షాపుల బకాయిలపై టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులు బుధవారం కొరడా ఝుళిపించారు. స్థానిక స్టేషన్ సెంటర్‌లో కొన్ని దుకాణాలకు మొండి బకాయిలు ఉండడంతో దుకాణ యజమానులకు నోటీసులు జారీ చేశారు. దుకాణానికి రూ.రెండు లక్షల వరకు బాకాయిలు ఉండటంతో మున్సిపల్ రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులు షాపులు సీజ్ చేయడానికి సిద్ధమయ్యారు. మున్సిపాలిటీ నుంచి లీజుకు తీసుకొని షాపుల యజమానులు ఇతరులకు సబ్ లీజ్‌కు ఇచ్చి వారి నుంచి అధిక మొత్తంలో అద్దెలు వసూలు చేస్తూ మున్సిపాలిటీకి అద్దెలు చెల్లించడం లేదని గుర్తించారు. రెండు రోజుల్లో బకాయిలు చెల్లించకపోతే షాపులకు తాళాలు వేస్తామని హెచ్చరించారు. మున్సిపల్ ఇన్‌చార్జి రెవెన్యూ అధికారి ఈసీహెచ్ ప్రసాద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టరు పి.నరేంద్రకుమార్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్‌భవ


నాడు-నేడులో అభివృద్ధి చేసిన పులిమేరు పీహెచ్‌సీ


అధునాతన భవనంలో వైద్యసేవలు అందుతున్న ఏరియా ఆసుపత్రి భవనం


వైఎస్సార్ ప్రాథమిక పట్టణ ఆరోగ్య కేంద్రంలో రోగికి సేవలందిస్తున్న వైద్యులు

- పట్టణ, గ్రామీణవాసులకు ఉచిత వైద్యం
- ఆరోగ్య సంరక్షణకు పీహెచ్‌సీల భరోసా

పెద్దాపురం: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేపట్టిన నాటి నుంచి వైద్య రంగం కొత్త పుంతలు తొక్కింది. గతంలో పట్టణంలో ఏరియా ఆసుపత్రి మినహా మరే ఆసుపత్రి నుంచి ప్రభుత్వ సేవలు అందిన దాఖలాల్లేవు. ప్రస్తుతం డాక్టర్ వైఎస్సార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పేరుతో మరో రెండు పీహెచ్‌సీలు ఏర్పాటు చేసి వైద్య సేవలందిస్తున్నారు. సుమారు కోటి రూపాయలతో అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మిస్తున్నారు. అద్దె భవనాల్లో నడుస్తున్న పీహెచ్‌సీలకు సొంత భవనాల నిర్మాణం ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనే సాధ్యపడింది. అలాగే మండలంలోని పులిమేరు, కాండ్రకోట పీహెచ్‌సీలతో పాటు మిగిలిన గ్రామాల్లో విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రజల వద్దకే వైద్య సేవలందించే దిశగా చర్యలు చేపట్టింది. ఒక్కో విలేజ్ క్లినిక్ నిర్మాణానికి రూ.20 లక్షలతో గ్రామీణ పీహెచ్‌సీలు నిర్మించి సేవలు అందించేందుకు చర్యలు తీసుకున్నారు.

ఆదరణ అమోఘం

ఈ ఆసుపత్రుల్లో ప్రాథమికంగా షుగర్, బీపీ, వాంతులు, విరేచనాలు తదితర వ్యాధులకు ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చు. ఇక్కడ 64 రకాల వైద్య సేవలతో పాటు 172 రకాల మందులు లభిస్తాయి. ఒక్కో ఆసుపత్రికి రోజుకు 30 నుంచి 50 మంది వరకు ఔట్ పేషెంట్లు వస్తున్నారంటే ఈ ఆసుపత్రులకు వస్తున్న ఆదరణ ఎంతో అర్థం చేసుకోవచ్చు. ఉదాహరణకు స్థానిక ఏరియా ఆసుపత్రి పెద్దాపురం పరిసర ప్రాంతాల నుంచి సుమారు రోజుకు 100 నుంచి 120 మంది వరకు ఓపీ వస్తోంది. పెద్దాపురం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అందుతున్న వైద్య సేవలపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నాడు..

పెద్దాపురం పట్టణంలో ఏరియా ఆసుపత్రి, పులిమేరు, కాండ్రకోట పీహెచ్‌సీలు మినహా మరే వైద్య సేవలు లేవు. మందుల కొరత వేధించేవి. వైద్య పరీక్షలూ అంతంత మాత్రమే. ఇక ఆస్పత్రుల్లో సౌకర్యాలు మృగ్యం. ఇలా టీడీపీ హయాంలో పట్టణ వైద్యం అనారోగ్యంతో గాడి తప్పింది.

నేడు..

ఏరియా ఆసుపత్రి వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అయ్యింది. అర్బన్ హెల్త్ సెంటర్‌తో పాటు మరో రెండు పీహెచ్‌సీల ద్వారా ప్రజల వద్దకే వైద్యం అందించేలా చర్యలు చేపట్టారు. 104 ద్వారా ప్రతి వార్డులో ప్రజలకు వైద్య సేవలందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతంలో రెండు పీహెచ్‌సీలను నాడు–నేడు పథకం ద్వారా అధునాతన పరికరాలతో అన్ని వైద్య పరీక్షలతో సేవలందిస్తున్నారు. ప్రతి గ్రామంలో విలేజ్ క్లినిక్ నిర్మించి గ్రామీణ ప్రాంత ప్రజలకు చేరువలో వైద్య సేవలందిస్తున్నారు.

పెద్దాపురం అర్బన్, రూరల్‌లో రాజమహేంద్రవరం రోడ్డులో ఏరియా ఆసుపత్రి, పాత ఆస్పత్రి వీధిలో అర్బన్ హెల్త్ సెంటర్, శోభా థియేటర్ వీధి, సినిమా సెంటర్, పులిమేరు, కాండ్రకోటలో డాక్టర్ వైఎస్సార్ ప్రాథమిక పట్టణ ఆరోగ్య కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో మరో 20 విలేజ్ క్లినిక్‌లు ఉన్నాయి.

అందుబాటులో వైద్య సేవలు



ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనే అన్ని రకాల వైద్య సేవలు అందుతున్నాయి. చిన్నపాటి జ్వరం వస్తే ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్ళి వేలకు వేలు ఖర్చు చేసేవాళ్లం. ఇప్పుడు పెద్ద రోగాలకు కూడా ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవలు అందుతున్నాయి. 64 రకాల వైద్య సేవలను ఉచితంగా అందిస్తున్నారు.

– లక్కాకుల కృష్ణ, కాండ్రకోట, పెద్దాపురం మండలం

ప్రజలకు చేరువలోనే



సామాన్య ప్రజలందరికీ వైద్యం అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఫ్యామిలీ డాక్టర్‌గా ప్రతి ఇంటికీ వెళ్లి వైద్యం అందించేలా అన్ని సేవలూ అందిస్తున్నాం. మాములు సమయాల్లోనూ ఓపీ బాగా పెరిగింది. వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచి 24 గంటల వైద్యం అందిస్తున్నాం.

– డాక్టర్ చంద్రకిరణ్‌బాబు, పీహెచ్‌సీ వైద్యుడు, కాండ్రకోట, పెద్దాపురం మండలం

శ్రీరక్షతో అధిక దిగుబడి

దుంప పంటను పరిశీలించిన కేరళ శాస్త్రవేత్తలు


ఆర్‌బీ పట్నంలో దుంప పంటను పరిశీలిస్తున్న కేరళ శాస్త్రవేత్తలు

పెద్దాపురం: మెట్టలో సాగవుతున్న దుంప పంటను తిరువనందపురంలోని కేంద్రీయ దుంప పంటల పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ జి.బైజు, డి.జగన్నాథన్, భువనేశ్వర్ శాస్త్రవేత్త డాక్టర్ నెడుం బిజియన్ పరిశీలించారు. పెద్దాపురం దుంప పరిశోధన కేంద్రం, రాయభూపాలపట్నం, కట్టమూరు గ్రామాల్లో కర్ర పెండలం దుంప సాగును బుధవారం పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త ఎం.జానకి, ఉద్యాన శాఖాధికారి ఎస్.సుజాతలతో కలసి పరిశీలించారు. కేరళ నుంచి తీసుకువచ్చిన శ్రీ రక్ష విత్తనాన్ని ఇక్కడి రైతులకు పంపిణీ చేశామని, 8 నుంచి 9 నెలల వ్యవధిలో కోతకు వచ్చే కర్రపెండలం దుంప దిగుబడిపై రైతుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నామని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. సాధారణ విత్తనం కంటే శ్రీరక్ష మరో 10 పుట్లు (ఒక పుట్టు అంటే 75 కిలోలు) అధికంగా దిగుబడి రావడం అభినందనీయమని శాస్త్రవేత్తలు అన్నారు. అనంతరం రైతుల నుంచి సాగు వివరాలు, దిగుబడి వంటి అంశాలను వారు అడిగి తెలుసుకున్నారు. తొలుత శాస్త్రవేత్తలు గ్రామంలోని కర్రపెండలం సాగు పంటను పరిశీలించి, అక్కడ నుంచి ఫ్యాక్టరీ తరలిస్తున్న దుంప కర్ర దిగుబడిపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌ఏలు ఎం.చిలకమ్మ, విజయదుర్గ, ఎం.సత్తిబాబు, జ్యోతి, మల్లిక్, దివ్య, రైతులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో మెరుగైన పాలన

- నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ దొరబాబు

పెద్దాపురం: సచివాలయ వ్యవస్థ ద్వారా రాష్ట్రంలో మెరుగైన ప్రజా సంక్షేమ పాలన సాగుతోందని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని కట్టమూరు గ్రామంలో సుమారు రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం–2 భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. సర్పంచ్ దిమ్మల పుష్పరత్నం అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు, రైతులకు నేరుగా సంక్షేమ పథకాలు అందాలనే ఉద్దేశంతో వలంటీర్, సచివాలయ వ్యవస్థను సీఎం జగన్ అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. రైతన్నలకు అందుబాటులో వ్యవసాయ సేవలందించాలని ఆర్బీకేలను ప్రారంభించారన్నారు. వైస్ ఎంపీపీ మిరియాల రాజా, ఏఎంసీ వైస్ చైర్మన్ బండారు వీరబాబు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఏలేటి అనంతలక్ష్మి, ఎంపీటీసీలు నల్లల సూర్యకుమారి, ఉప్పటి ప్రసాద్, ఉప సర్పంచ్ బండారు చంటిబాబు, జోడుగుళ్ల చైర్మన్ మేడిద వెంకట రామారావు, పార్టీ సీనియర్ నాయకులు పెంటా విజయ్‌కుమార్, గ్రామ పార్టీ అధ్యక్షుడు నల్లల గోవిందు మాట్లాడుతూ ప్రజలకు అందిస్తున్న ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మెరుగైన పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని కోరారు. తొలుత వారు సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈఓపీఆర్డీ రాజశేఖర్, వ్యవసాయ శాఖ ఏడీఏ దైవకుమార్, పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణ, సిద్ధాంతపు ప్రసాద్, యేసేపు జోషి, ఆనంద్, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు

కల్యాణోత్సవాలకు రాట ముహూర్తాలు


గొల్లప్రోలు వేంకటేశ్వరస్వామి ఆలయంలో పందిరిరాటకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలో వేంచేసిన వేంకటేశ్వరస్వామి వారి దివ్య కల్యాణోత్సవాలకు సర్వం సిద్ధమైంది. ఆలయ కమిటీ సభ్యులు బుధవారం పందిరి రాట వేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. గొల్లపల్లి చిన్నకొండ దంపతులతో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేయించి పందిరి రాట వేశారు. ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు స్వామివారి కల్యాణోత్సవాలు నిర్వహించనున్నట్లు అన్నవరం దేవస్థానం ప్రత్యేక ఆహ్వానితుడు మొగలి అయ్యారావు తెలిపారు. ఈ నెల 20వ తేదీన స్వామివారి దివ్యకల్యాణం నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. కల్యాణోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

పాదగయ క్షేత్రంలో..


పాదగయ క్షేత్రంలో పందిరి రాట వేస్తున్న ఈఓ పులి నారాయణమూర్తి

పిఠాపురం పాదగయ క్షేత్రంలో నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలకు బుధవారం పందిరిరాట వేశారు. ఆలయ ఈఓ పులి నారాయణమూర్తి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి మహాశివరాత్రి ఉత్సవ పనులను ప్రారంభించారు. వచ్చే నెల 6వ తేదీ నుంచి 11వ తేదీ వరకూ శివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఈఓ పులి నారాయణమూర్తి తెలిపారు.

'సురక్ష' శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

మున్సిపల్ కమిషనర్ రామారావు


రోగులకు కిట్లు అందజేస్తున్న వైద్యాధికారితో పాటు కమిషనర్ రామారావు, కౌన్సిలర్ లక్ష్మీనారాయణ

సామర్లకోట: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు అన్నారు. స్థానిక యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌లో బుధవారం ఆయన ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరాల్లో రోగులను పరీక్షించడం వల్ల ప్రాథమిక స్థాయిలో రోగాలను గుర్తించి మందులు వాడటం ద్వారా మంచి ఆరోగ్యం పొందే అవకాశం ఉంటుందన్నారు. గుండెకు సంబంధించి ఈసీజీ, కంటి పరీక్షలు, బీపీ, సుగర్ వంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేయనున్నట్టు తెలిపారు. డాక్టర్ భవ్యశ్రీ, కౌన్సిలర్ ఆవాల లక్ష్మీనారాయణ, డాక్టర్ వైఎస్సార్ యువసేన ఉమ్మడి జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీనివాసరావు, పాఠశాల హెచ్‌ఎం యు.సత్యనారాయణ, మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు గిడుతూరి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు. శిబిరంలో 220 మంది పరీక్షలు చేయించుకున్నట్టు వైద్యాధికారి భవ్యశ్రీ తెలిపారు.

సరస్వతీ నమోస్తుతే..

- వైభవంగా వసంత పంచమి వేడుకలు
- ఆలయాలు, పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసాలు
- అమ్మవారికి ప్రత్యేకాలంకరణ
- ఆలయంలో హోమం, పూర్ణాహుతి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో సరస్వతీదేవి జన్మదిన వేడుకలు వైభవంగా జరిగాయి. వసంత పంచమి సందర్భంగా బుధవారం విఘ్నేశ్వర పూజతో కార్యక్రమాలు ప్రారంభించి పంచామృతాభిషేకాలు, సరస్వతీ హోమం నిర్వహించారు. అనంతరం పట్టు వస్త్రాలు, బంగారు, వెండి ఆభరణాలతో అమ్మవారికి ప్రత్యేకాలంకరణ చేశారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. వారికి దాత, మాజీ ఎంపీపీ కొండపల్లి కృష్ణమూర్తి దంపతులు, కౌన్సిలర్ యార్లగడ్డ జగదీష్, మాజీ ట్రస్టు బోర్డు సభ్యులు బీవీ రమణ, చల్లా సత్తిబాబు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. అలాగే సరస్వతీదేవి ఫోటోలు, పుస్తకాలు, పెన్నులు అమ్మవారి వద్ద ఉంచి పూజలు చేసి విద్యార్థులకు పంచారు. పలువురు చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేశారు. అక్షరాభ్యాస కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. అల్లకి రాజ్‌గోపాల్ సరస్వతీ హోమం, పూర్ణాహుతి నిర్వహించారు.

ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, సన్నిధి రాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు వినయ్ ఈ పూజలు నిర్వహించారు. విద్యార్థులకు దేవి ఫిషరీష్ యాజమాన్యం నోట్ పుస్తకాలు అందజేశారు. అనంతరం ఆలయ అన్నదాన ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు అన్నదాన ఏర్పాట్లు పర్యవేక్షించారు. అదే విధంగా మెహర్ కాంప్లెక్స్‌లోని గణపతి ఆలయంలోను, మాధవపట్నంలోని యండమూరి వీరేంద్రనాథ్ విద్యా పీఠంలో సరస్వతిదేవికి విద్యార్థులు పూజలు చేశారు.


తాటిపర్తిలో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహిస్తున్న అర్చకులు


తాటిపర్తిలో సరస్వతీదేవిగా అపర్ణాదేవి అమ్మవారు

పిఠాపురంలోని ఆలయాల్లో...

పిఠాపురం: సరస్వతీదేవి జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం పిఠాపురం నియోజకవర్గంలోని పలు ఆలయాల్లో సరస్వతీ పూజలు, చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణాదేవి ఆలయంలోని అపర్ణాదేవి అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ఆకొండి ప్రభాకరశాస్త్రి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసాలు చేయించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గారపాటి బుజ్జి, ఉప సర్పంచ్ దాసం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. పిఠాపురం పాదగయక్షేత్రంలోని సరస్వతీదేవి ఆలయంలో బుధవారం సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు.




పంచారామ ఆలయంలో అమ్మవారి వద్ద ఉంచిన పుస్తకాలు, పెన్నులు, విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంచుతున్న కృష్ణమూర్తి దంపతులు, కౌన్సిలర్

దాతలకు యాతన లేకుండా చర్యలు

సాక్షి ఇంపాక్ట్

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి వివిధ రూపాల్లో విరాళాలు సమర్పించే భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు దేవస్థానం ధర్మకర్తల మండలి తీర్మానించింది. దేవస్థానానికి రూ.కోట్లు, రూ.లక్షల్లో విరాళాలు సమర్పించిన దాతలు సత్యదేవుని ఆలయానికి వచ్చినపుడు పడే ఇబ్బందులపై 'సత్తెన్న సాక్షిగా దాతలకు యాతన' అనే శీర్షికతో ఈ నెల 8న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ అధ్యక్షతన బుధవారం రత్నగిరిపై జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో ఈ అంశంపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. రూ.లక్ష, అంత కంటే ఎక్కువ విరాళాలిచ్చిన దాతలకు విరాళాలను అనుసరించి గుర్తింపు కార్డులు ఇవ్వనున్నారు. రూ.లక్ష నుంచి రూ.పది లక్షలు విరాళాలిచ్చిన దాతలకు పదేళ్లపాటు ఏడాదికి రెండు సార్లు ఆయా విరాళాల స్కీంలో పొందుపర్చబడిన సదుపాయాలు కల్పిస్తారు. రూ.10 లక్షలకు మించి విరాళాలిచ్చిన దాతలకు 15 సంవత్సరాల పాటు ఏడాదికి మూడు సార్లు విరాళాల స్కీంలో పొందుపర్చిన సదుపాయాలు కల్పిస్తారు. దాతలకు వసతులు కల్పించేందుకు గాను ప్రత్యేక కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తారు. ఈ సమావేశంలో ఈఓ రామచంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.



ఈ నెల 8న 'సాక్షి'లో ప్రచురితమైన కథనం

ఘనంగా ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రతిష్ఠ

జగ్గంపేట: మండలంలోని ఇర్రిపాక ఏలేరు నదీ తీరంలో ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రతిష్ఠాపన మహోత్సవం బుధవారం అంగరంగవైభవంగా జరిగింది. కాకినాడ శ్రీపీఠం పీఠాధిపతి స్వామి పరిపూర్ణానంద సరస్వతీ చేతుల మీదగా ద్వాదశ లింగాలను ప్రతిష్ఠించారు. ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రతిష్ఠాపనలో భాగంగా మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దంపతులు, కుటుంబ సభ్యులు ఏలేరు నది తీరంలో గత నాలుగు రోజులుగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ దేశంలో ఎంతో విశిష్టత కలిగిన ద్వాదశ జ్యోతిర్లింగాలను ఏలేరు నదితీరాన శివాలయంలో ప్రతిష్ఠించడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ లింగాలకు వాయు ప్రతిష్ఠ చేయడం ద్వారా ప్రతిఒక్కరూ శివలింగాలను తాకి అభిషేకాలు, దర్శనం చేసుకోనే అవకాశం ఉందని తెలిపారు. మాజీ మంత్రి కాపు, ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం, పలువురు ప్రముఖులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. శివరాత్రి రోజు మహా కుంభాభిషేకానికి సిద్ధం చేస్తున్న శివలింగాలను పరిశీలించారు.